# హ్యాపీ బుక్ స్టాల్

కె.వి.నరేందర్

**మొ**యినొద్దీన్ బాబా బుక్‌స్టాల్‌లో విచారంగా కూచున్నాడు.

బస్టాండంతా రద్దీగా వుంది. వచ్చీపోయే బస్సుల శబ్దాలతో రొదగా వుంది. పక్కనే జ్యూస్ సెంటర్‌లోని గ్రైండర్ల శబ్దం కంపరమెక్కిస్తోంది. వేలాడదీసిన టీవీల్లోని పాటలు మరింత కంపరమెక్కిస్తున్నాయి.

బాబా ఓసారి నిర్లిప్తంగా.. నిర్వికారంగా టీవీ వైపు చూసాడు.

ఆ రంగుల డబ్బా.. తన జీవితాన్నే దెబ్బకొట్టింది. ఇక్కడే కాదు.. తనింట్లో కూడా. తను కిటికీలు, తలుపులూ మూసేసు కున్నా తనింట్లో జొరబడి మాటల్నే కరువు జేసింది.

తనకి అన్నం పెట్టి వాడలోని ముచ్చట్లన్నీ చెప్పి కొసిరి కొసిరి వడ్డించే భార్య రజియా.. ఇప్పుడు పల్లెం తన ముందరపడేసి ముందు గదిలోకెళ్ళి సీరియల్ చూస్తూ కూచుంటుంది.

అన్నీ కేబుల్ బంధాలై పోయాయి.

బాబా ఓసారి తన స్టాల్‌లోని బుక్స్‌వైపు చూసుకున్నాడు. రంగు రంగుల ముఖ చిత్రాలతో వంద లాది పత్రికలతో కళకళలాడే బుక్ స్టాల్‌లో ఇప్పుడేమీ లేవు. రెండు వారపత్రికలు.. వేలాడదీసిన నాలుగు దినపత్రికలు.. పది ఇరవై బూతు పుస్తకాలు.. అంతే.

ఒకప్పుడు ఉదయం అయిదింటి నించి సాయంత్రం తొమ్మిది దాకా తన స్టాల్ ముందు ఇరవై మంది దాకా వుండేవాళ్లు.

ఇప్పుడేరి? ఒక్కరైనా తన బుక్‌స్టాల్ గురించి అడగరే?

జిరాఫీల్లా మెడలు సాగదీసి కళ్ళని పెకిలించి టివి స్క్రీన్‌కి అతికించి ప్రతి రంగుల డబ్బా ముందు ఇరవై ముప్పయి మంది లీనమై .. ధ్యానమై..

మొయినొద్దీన్ బాబా కళ్ళని కన్నీటి తెరలు కప్పేసాయి.

ఇరవై అయిదేళ్ళ కింద చిన్న టేలాతో మొదలైన బుక్‌స్టాల్ క్రమ క్రమంగా ఎదిగి కళకళలాడేది. వసీమా పెళ్ళి చేసినప్పుడు ఎంత సంపాదన?

బిడ్డ పెళ్ళికి ఎంతో మంది అధికార్లు, కవులు, రచయితలు, పాఠకులు వచ్చారు అభిమానంతో. ఇప్పుడు వాళ్ళంతా ఏరి? ఎక్కడా కన్పించరే? అంతా ఒక్కసారే మాయమైనట్టు ఎవరూ కన్పించరే..

అదుగో..

జనం ఉరుకులు.. పరుగులు.. దేనికోసం? ప్రపంచ విజ్ఞానమంతా పుస్తకాల్లో వుందంటారే.. మరి ఒక్కరూ బుక్‌స్టాల్ వైపు రారేం?

'ఒక్క అక్షరం ముక్క లక్ష మెదళ్ళకు కదలిక' అని తను ఇష్టంతో రాసిపెట్టిన బోర్డు చిలుం పట్టిపోతోంది. తన పట్ల ఆప్యాయంగా చూసేవాళ్ళంతా కనీసం పట్టించుకోవట్లేదు.

తన బుక్‌షాప్ తనకే పరాయిదైపోతోంది.



మొయినొద్దీన్ బాబాకి గుండె బరువెక్కింది. గతం కాగితంలా రెపరెపలాడింది.

వయసు మీద పడుతుంటే బుక్‌స్టాల్ చూసుకొమ్మని పెద్ద కొడుక్కి చెప్పినప్పుడు వేలకు వేలు డిపాజిట్లు కట్టి.. గొర్రె తోకంత కమీషన్ కోసం పద్దెనిమిది గంటలు శవం ముందు కాపలా కాసినట్లు ఆ టేలాలో కూచోవాలా? నావల్ల కాదు. నేను పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసింది బాగా బతకడానికి.. అని నిష్కర్షగా చెప్పాడు.

''ఒరేయ్! ఒక్కపైసా ఖర్చులేకుండా కొన్ని వందల పుస్తకాలు చదివే అవకాశం ఆ టేలాయేరా ఇచ్చింది. ఆ జ్ఞానమే రాకపోతే నీకు చదువే అబ్బేది కాదు. కడుపునిండా అన్నం పెట్టిన వాళ్ళని, చదివించిన మంచి పుస్తకాన్ని ఎప్పుడూ మర్చిపోవద్దు'' అన్నాడు.

''రోజూ ఆ బుక్‌స్టాల్‌తో నువ్వేం సంపాదిస్తున్నావ్? మహా అయితే అరవై నుంచి డెబ్బయ్ రూపాయలు. అంతకన్నా అదే బస్టాండ్‌లో బిచ్చమెత్తుకునేవాడు వందపైనే సంపాదిస్తున్నాడు''

కొడుకు మాట గునపంలా గుచ్చుకుంది. ఆ వృద్ధ హృదయం నిమిషం పాటు విలవిలలాడింది.

''ఒరేయ్ అజీమ్! ఇప్పుడు ఆ టేలాలో గిరాకీ తగ్గిందొచ్చు. నీకేం తెల్సురా దాని విలువ? గేటు తీసేవరకు మసీదు దగ్గర ఎవ్వరూ వుండరేమో కాని తెల్లారంగ అయిదింటి నుంచి మన టేలా ఎప్పుడు తీస్తామని ఎదురుచూసే వాళ్ళు ఎంతో మంది వుండేవారు. ఏదైనా పత్రిక ఆలస్యమైతే 'బాబా.. త్వరగా తెప్పించు' అని అడ్వాన్సిచ్చిపోయేవాళ్ళు. పుస్తకాలతో సమానంగా ఈ బాబాన్ని ప్రేమించేవాళ్ళు. పుస్తకాన్ని చూసినంత గౌరవంగా ఈ బాబాకి నమస్కారాలు చెప్పేవాళ్ళు. పుస్తకాల్ని చూసుకున్నంత అపురూపంగా ఈ బాబాని పలకరించేవాళ్ళు. రిజల్టు వచ్చిన రోజు మన టేలా ముందు ఒక జాతర జరిగేది''

''అదంతా ఒకప్పుడు. అసలిప్పుడు పుస్తకాలు ఎవరు చదువుతున్నారని. ఎవరూ చదవని పుస్తకాల్ని ముందేసుకుని రోజుల తరబడి కూర్చోవటం నావల్లకాదు. పోస్ట్ గ్రాడ్యుయేషన్ చేసి బుక్‌స్టాల్‌లో కూచోవటం ఎంత నామోషి'' అన్నాడు అసహ్యంగా.

ఆ మాటలు మొయినొద్దీన్ బాబాలో కలవరం కలిగించాయి.

''అలా అనకురా.. నీ ముగ్గురు చెల్లెల్ల పెళ్ళిళ్లు చేసింది ఆ టేలా సంపాదన తోనే. రజియా పెళ్ళికి, వసీమా పెళ్ళికి ఎంత గొప్ప గొప్ప వాళ్లొచ్చారో తెల్సా? వాళ్ళంతా ఆ టేలా వల్లనే కదరా పరిచయమైంది. డిపాజిట్లు కట్టకపోయినా నామీద నమ్మకంతో పత్రికలు పంపిన పబ్లిషర్లున్నారు. కాపీలు పెంచితే స్వీట్లు, బహుమతులు ఇచ్చిన సంపాదకులున్నారు. నాలుగు అన్నం ముద్దలు పెట్టిన అక్షరాలయంరా అది'' గొంతు జీరబోతుంటే కోపంతో వణికిపోతూ అన్నాడు.

''నువ్వెన్నయినా చెప్పు నాకు రేపోమాపో ప్రయివేటు కాలేజీలో లెక్చరర్‌గా వస్తుంది. రాకపోయినా ట్యూషన్లు చెప్పుకోనైనా బ్రతుకుతాను. ఆ బుక్‌స్టాల్‌తో ఎవడు బాగుపడ్డాడు? దాంతో ఏమైనా బంగ్లాలు సంపాదించావా? కార్లు సంపాదించావా? ఇంకా అది అక్షరాలయమట.. అక్షరాలయం'' అని అరిచాడు అజీమ్ విసుగొచ్చి.

''అలా అనకురా అజీమ్. పదిహేనేళ్ళ కింద పదిపన్నెండు మంది కుర్రాళ్లు నా దగ్గర డైలీ పేపర్లు వేసి బతికేవాళ్ళు. తెల్లారేసరికల్లా ఒక్కొక్కరూ ఆరొందల పేపర్లకి తక్కువ వేసి వచ్చేవాళ్ళు కాదు. ఈ ఇల్లు ఎలా కట్టానో తెల్సా.. ఆ కుర్రాళ్ళలో ఒకడు బ్యాంక్ మేనేజరయ్యాక వచ్చి.. 'బాబా.. నన్ను గుర్తుపట్టావా? అని బ్యాంక్‌కు తీసుకెళ్ళి తన గ్యారంటీతో ఈ ఇల్లు కట్టుకోవడానికి అప్పిచ్చాడు. రజియా పెళ్లిలో బంగారు ఉంగరం పెట్టాడో లెక్చరర్.. వాడూ నా దగ్గర పేపర్లేసిన కుర్రాడే. అమ్మకి ఆపరేషన్ జరిగినప్పుడు పదివేల చెక్ పంపించాడే ఓ ఎడిటర్.. అతడూ నా దగ్గర పేపర్లు పంచినోడే. ఇప్పుడంటే ఏజెన్సీలు పెరిగాయి కాని.. ఆ టేలా ఎంతమందికి అన్నం పెట్టిందో నీకేం తెల్సురా?'' అన్నాడు.

''కేవలం కడుపునిండగానే సరిపోదు. ఈ రోజుల్లో బతకడానికి చాలా చాలా కావాలి. అవన్నీ ఆ బుక్ స్టాల్‌తో తీరవు. నన్ను విసిగించకు. తమ్ముడ్నికూచోమను. వాడు ఖాళీగానే తిరుగుతున్నాడు కదా'' అన్నాడు సీరియస్‌గా.

మొయినొద్దీన్ బాధగా బట్టకుర్చీలో కూచున్నాడు.

''హనీఫ్‌కి బుక్‌స్టాలంటేనే గిట్టదు. బస్టాండ్ వైపే రాకపోయేవాడు. ఎప్పుడైనా వచ్చినా ఫ్రెండ్స్‌తో వచ్చి ఏ పుస్తకంలోనైనా బూతు బొమ్మలు కనపడితే వాటినోసారి తిరగేసి వెళ్ళిపోయేవాడు. పొద్దున్నే లేచి డైలీ పేపర్ వేసి రమ్మన్నా పది గంటల్దాకా లేవడు'' అని తనలో తానే గొణుక్కున్నాడు.

మనసంతా గజిబిజిగా అయింది.

అంతలోనే హనీఫ్ వచ్చాడు.

''హనీ...'' తండ్రి పిలుపుతో వంటింట్లోకి వెళ్తున్నవాడల్లా ఆగిపోయాడు.

''నాకు నడుం నొప్పి వస్తోంది. రేపట్నించి బుక్‌స్టాల్‌లో నువ్వే కూచోవాలి'' అన్నాడు బాబా.

హనీఫ్ ఏదో గుర్తొచ్చినట్లు తల పంకించి ''చెప్పటం మర్చిపోయాను. బుక్‌స్టాల్‌లో ఇంకెవరూ కూచోనక్కర్లేదు. నిన్ననే పోస్ట్‌లో మున్సిపాల్టీ వాళ్ల నోటీసొచ్చింది. బస్టాండ్‌ని వెడల్పు చేస్తారట. వారం రోజుల్లో అన్ని స్టాల్సు తొలగించాలి లేదంటే బుల్‌డోజర్లతో కూలదోస్తాం అని వార్నింగ్ ఇచ్చారు. ఇదిగో ఆ నోటీస్'' అంటూ ఓ కాగితం తండ్రి చేతిలో కుక్కిపోయాడు.

ఆ మాటల్ని విన్న మొయినొద్దీన్ శరీరం చిగురుటాకులా వణికిపోయింది. ఆ నిజాన్ని అలసిపోయిన పేగులు జీర్ణించుకోలేకపోయాయి.

తన జీవన సర్వస్వాన్ని ఎవరో కూలదోస్తున్నట్టు కంపించిపోయాడు. ఆ నోటీస్ చదివే ధైర్యం రాలేదు.

''పీడా బోయింది'' అనుకుంటూ అక్కన్నించి వెళ్లిపోయాడు అజీమ్. హనీఫ్ కూడా వెళ్ళిపోతున్నవాడల్లా తిరిగొచ్చి...

''చాలా సంవత్సరాల్నించి బస్టాండ్‌లో వున్న కొందరికి మాత్రం మళ్ళీ షాప్‌లు కేటాయిస్తారట. అదీ మున్సిపల్ అప్లికేషన్ పెట్టుకుంటే'' అనేసి వెళ్ళిపోయాడు.

మొయినొద్దీన్ కళ్ళు అప్పటికే తడి తడిగా మారాయి.

చచ్చిపోయిన ఆశ ఆ మాటతో చిగురించింది. ఆ నోటీస్ చదవకుండానే చేతి కర్ర తీసుకుని గబగబా బయల్దేరాడు మున్సిపల్ ఆఫీసుకి.

మొన్న తెంపిన మల్లెపువ్వు నడిచి వెళ్తున్నట్టు..

* * *

మున్సిపల్ ఆఫీస్ అంతా గోలగా వుంది.

ఛైర్మన్ చాంబర్ దగ్గర ఇంకా తొక్కిసలాటగా వుంది. బస్టాండ్ ముందర తోపుడు బండిపై అరటి పండ్లమ్ముకునే భీమయ్య మొయినొద్దీన్ బాబాని చూసి అడిగాడు..

''ఏం బాబా! ఇటొచ్చావ్'' అని.

బాబా విషయం చెప్పాడు.

''నేనూ బేకరీ పెట్టుకుందామనే దరఖాస్తు పెట్టుకోడానికి వచ్చిన... నువ్వు నారాయణ అనే ఎల్డీసీని కలువు'' అని చూపించాడు.

బాబా ఆ జూనియర్ అసిస్టెంట్ దగ్గరికెళ్ళి ''సాబ్.. బస్టాండ్ కూలగొట్టి పెద్దగా కడతారుట. ఇప్పుడు బస్టాండ్‌లో నాకో బుక్‌షాపుంది. మళ్ళీ నాకు షాప్‌కోసం స్థలమైనా, దుకాణమైనా కావాలి'' అన్నాడు వినయంగా.

జూ.అ. తలెత్తికూడా బాబా వైపు చూల్లేదు. చూడకుండానే చెప్పాడు–

''ఇదివరకున్న షాప్ స్థలం నీ సొంతమా? మల్లా కావాలనడానికి. ఎక్కడి స్థలాలక్కడ కౌన్సిలర్లు పంచుకుంటుండ్రు. నువ్వు పోయి ఛైర్మన్‌ను కలువు. లేకపోతే మీ వాడ కౌన్సిలర్‌ని పట్టుకురా'' అని.

''అది కాదు సాబ్.. చాలా ఏండ్ల నించి నా షాప్...'' అంటూ ఏదో చెప్పబోయాడు.

''పోవయ్యా.. ఉడిపి హోటల్నే కూలగొడ్తుండ్రు. నీ పుస్తకాల షాపుకచ్చిందా? ఇయాల్రేపు ఎవడో పుస్తకాలు చదువుతుండా.. జనాలకు అంత తీరికెక్కడిది? డైలీ పేపరే మీద మీద చూస్తాండ్రు.. వెళ్ళవయ్యా'' అని కసురుకున్నాడు.

బాబా దిగాలుగా లేచి ఛైర్మన్‌ని కలువడానికి ప్రయత్నించాడు. కాని రెండు గంటలు నిల్చున్నా లోపలికి వెళ్ళడానికి అనుమతి దొరకలేదు. అంత రద్దీగా వుంది. తర్వాత ఛైర్మన్ హడావిడిగా బయటికొచ్చి సెల్‌ఫోన్‌లో ఏదో మాట్లాడుకుంటూ కారెక్కి వెళ్ళిపోయాడు.

మొయినొద్దీన్ బాబా నీరసంగా ఇంటికి బయల్దేరుతుంటే.. తనవాడ కౌన్సిలర్ శంకర్ కలిసాడు.


''శంకర్ బేటా.. నీకోసమే వచ్చిన'' అన్నాడు.

కాని శంకర్ పట్టించుకోలేదు. పక్కనున్న వ్యక్తితో.. ''ఇండ్ల రిపేర్లకు డెబ్బయ్ వేలు లోను ఇస్తుండ్రు. నేను ఛైర్మన్‌గారితో మాట్లాడుతా. పదివేలియ్యి. ఏదో రిపేరు చూయించరాదు. వడ్డీలేని పైస.. పదేండ్లల్ల కట్టాలే. అప్పటివరకు ఎవడుంటాడో ఎవడు పోతాడో.. ఏమంటావ్'' అంటున్నాడు.

ఆ వ్యక్తి చాటుగా అయిదువేలు తీసి శంకర్ జేబులో పెట్టాడు.

''శంకరన్నా! ఇవి నీకు. శాంక్షన్ చేయించు. ఛైర్మన్ సాబ్‌కు పదివేలిత్త'' అని షేక్‌హ్యాండిచ్చి వెళ్ళిపోయాడు.





## ముఖద్వారాల్లో వెలుగులు

నవనాగరికతకు పేరెన్నికగన్న బాబిలోనియాలో ముఖద్వారాల్లో వెలుగులు చూడొచ్చు. వేల సంవత్సరాల క్రితమే చక్రవర్తులు తమ ఇళ్ల ముఖద్వారాలకు వివిధరకాల జంతువుల బొమ్మలను రంగరించి ఓ సుందర స్వప్నంగా తీర్చిదిద్దిన తీరు అమోఘం. విదేశీ పర్యాటకుల నాకర్షించటంలో ఎప్పుడూ ముందంజలో వున్న బాబిలోనియాకు ఇలాంటి కళా ద్వారాలూ ఓ ప్రత్యేకత.

అప్పుడు శంకర్ బాబాని చూసి ''ఏం తాతా! ఇటచ్చినవ్?'' అన్నాడు.

''బస్టాండ్ కూలగొట్టి పెద్దగా కడతారట. నా పుస్తకాల షాపుకోసం నాకూ ఓ దుకాణం కావాలి'' అన్నాడు.

''కష్టం తాతా. బస్టాండ్ల పది దుకాణాలే కడుతున్నారు. వాటికోసం మినిస్టర్ల నుంచి కూడా రికమండేషన్లు వస్తున్నాయ్. దుకాణం దొరకమంటే కష్టమే'' అన్నాడు వెళ్లిపోతూ.

''అట్లా అనకు బేటా. ఇరవై రెండేండ్ల నుంచి బస్టాండ్‌లో నా బుక్ షాపుంది. ఎట్లనన్న జేసి ఓ దుకాణం ఇప్పించాలే'' అన్నాడు.

''కష్టమైతది తాతా. మా చైర్మన్‌కు పైసలియ్యంది ఏ పనికాదు. అజీమ్‌తోని ఓ అయిదువేలు పంపించు. ఎలాగైనా నేను కష్టపడ్త'' అని మరో మాట విన్పించుకోకుండా వెళ్ళిపోయాడు.

అయిదు వేలు...

మొయినొద్దీన్ గుండెలో రాయిపడింది. అంత డబ్బు తానెక్కడినుంచి తేగలడు. చైర్మన్‌ని కలిసి బతిమాలుకుంటే.. అనుకొని మర్నాడు ఉదయమే చైర్మన్ ఇంటికి నడుచుకుంటూ వెళ్ళాడు. పని మనిషికి చెప్పి లోపలికి పంపించమంటే ఓ గంట సేపు ఆగు.. అని వరండాలో కూచోబెట్టాడు. పదిన్నర దాకా కాంట్రాక్టర్లే వచ్చిపోతున్నారు. ఇక తనని పిలుస్తారనుకునే టైంలో పనిమనిషి బయటికొచ్చి చెప్పాడు-

''చైర్మన్‌సాబ్ ఇప్పుడు కలవరు తాతా. డిఎస్పీ సారు భోజనానికి వస్తుండట. రేపు రా'' అని చెప్పి లోపలికెళ్ళిపోయాడు.

వంగిపోతున్న శరీరాన్ని ఈడ్చుకుంటూ బాబా బాదగా కదిలాడు.

ఆ తర్వాతి రోజు ఎవరో చెప్తే కమీషనర్ ఇంటికి వెళ్ళాడు. కాని కమీషనర్ హైదరాబాద్ వెళ్లిపోయాడని తెలియటంతో కౌన్సిలర్ శంకర్ ఇంటికి వెళ్ళాడు.

''బేటా ఎట్లనన్న జేసి దుకాణం ఇప్పించాలె'' అని బతిమాలుకున్నాడు.

కౌన్సిలర్ కనికరించలేదు.

''ఒక్కో దుకాణానికి ఇరవైవేలు లంచమిస్తుండ్రు. నీకోసం అయిదువేలు చెప్పిన. అవేమన్న నా జేబులకా? చైర్మన్‌కే పోతయ్. అజీమ్‌తోని పంపించు. ఓ దుకాణం రిజర్వు చేయించి పెడతా'' అని లోపలికెళ్లిపోయాడు.

అయిదువేలివ్వక తప్పదని అర్థమైన మొయినొద్దీన్ బాబా ఇల్లు చేరి ఆలోచనలో పడ్డాడు. అయిదు వేలు.. ఎలా? ఎలా? ఎలా??

బుక్‌షాప్‌ని ఎలాగైనా దక్కించుకోవాలనే ఆరాటంలో ప్రాణప్రదంగా దాచుకున్న పెళ్ళినాటి వెండి పల్లెం బయటకు తీసాడు.

ఏనాడూ ఆ పల్లెంలో భోజనం చేయలేదు. రంజాన్ ఉపవాసాలప్పుడైనా దాంట్లో తినమని భార్య చెప్పినా మక్కాకి వెళ్ళొచ్చిన తర్వాత తింటానని చెప్పేవాడు. పళ్లాన్ని చివరిసారిగా చూసుకొని బజారుకొచ్చి అమ్మేసాడు.

అయిదువేల నాలుగు వందలొచ్చాయి. అటునించి అటే కౌన్సిలర్ ఇంటికెళ్లి అయిదువేలు ఇచ్చాడు.

''మూడు నెలల్లో బస్టాండు పనులు పూర్తవుతాయి. నీకిచ్చే దుకాణానికి మున్సిపాలిటీకి నెలకు అయిదు వందలు కిరాయి కట్టాలి'' అని చెప్పి అయిదువేలు తీసుకున్నాడు.

* * *

దుకాణం సాంక్షన్ అయిందని తెలియగానే హనీఫ్‌లో మార్పొచ్చింది.

'బుక్‌స్టాల్‌కి నేనే వెళ్తాను. నువ్వింట్లో రెస్ట్ తీసుకో' అని వెళ్లేవాడు. ఆ మాటల్ని తండ్రి నమ్మాడు.

బస్టాండు కూల్చేస్తూ.. పనులు మొదలయ్యాయి.

పత్రికల్ని బయటే ఓ చోట కూచుండి అమ్మాల్సి వస్తోంది. హనీఫ్ నెల రోజుల్లో కొన్ని పత్రికల సేల్స్ తగ్గించి.. డిపాజిట్లు వాపస్ తెప్పించుకున్నాడు. కొన్ని ఏజెన్సీలు రద్దు చేసుకున్నాడు. తండ్రితో పత్రికల వాళ్లే సరిగా పంపించట్లేదని చెప్పాడు. తర్వాత మున్సిపాలిటీ వాళ్ళు దుకాణం ఇవ్వటం మన అదృష్టం. అంతమంచి సెంటర్‌లో బుక్‌స్టాల్‌లో ఏం లాభాలుంటాయి. నేను జ్యూస్ సెంటర్ నడుపుతా'' అని గొడవ పడటం మొదలెట్టాడు.

మొయినొద్దీన్ బుక్‌స్టాల్ తప్ప మరేదీ వద్దన్నాడు.

''రోజు రోజుకీ పత్రికల సర్క్యులేషన్ పడిపోయి ఉన్న పత్రికల్ని ఎవరూ కొనట్లేదు. ఈగలు తోలుకుంటూ కూచోవాల్సి వస్తోంది. నా మాట విను. రేపు అయిదు గ్రెండర్లు కొంటున్నాను. ముగ్గురు పిల్లల్ని పెట్టుకుంటే దుకాణం బాగా నడుస్తుంది'' అని సీరియస్‌గా వెళ్ళిపోయాడు హనీఫ్.

మొయినొద్దీన్ బాబా కళ్ళల్లో నీల్లు తిరిగాయి. ఇంట్లో వాళ్లంతా హనీఫ్‌నే సమర్థించారు. జీవిత కాలమంతా కూచొని బుక్‌స్టాల్‌తో ఏం సంపాదించావని నిలదీసారు. చివరికి అదే జ్యూస్ సెంటర్‌లో ఓపక్క చిన్న టేలా లాంటిది పెట్టి దాంట్లో నాలుగు దినపత్రికలు, రెండు వారపత్రికలు వేలాడదీద్దాంలే.. అన్నట్టు నిర్ణయించారు.

మొయినొద్దీన్ మనసు తడిసిపోయిన పేపర్ ముద్దలా అయింది.

* * *

'షాహిద్ జ్యూస్ సెంటర్'.

గ్రైండర్ల రొదతో బిజీగా వుంది. హనీఫ్ బిజీగా వున్నాడు. పని పిల్లలూ బిజీగా వున్నారు. బస్టాండ్‌లోని షాపింగ్ కాంప్లెక్స్‌లన్నీ బిజీగానే వున్నాయి.

మొయినొద్దీన్‌కి కంపరంగా వుంది. మారిపోయిన బస్టాండంతా కోలాహలంగా వున్నా.. జ్యూస్ సెంటర్‌లోనే ఓ మూల టేబిల్‌పై పత్రికలు పెట్టి స్టూల్‌పై కూర్చున్నాడు. అయిదారు దినపత్రికలు అమ్ముడుపోయాయి.

మొయినొద్దీన్‌కి జాతర్లో తప్పిపోయిన చిన్న పిల్లాడిలా అన్పించింది. ఇంక కూచోలేకపోయాడు. చేతి కర్ర తీసుకొని బస్టాండ్ బయటికొచ్చి బాధగా వెనక్కి తిరిగి చూసాడు.

బస్టాండ్ పరాయిదైపోయింది.

అక్కడే పడుకునే బిచ్చగాడు నీడ దొరక్క చచ్చిపోయాడు. ఎప్పుడూ తిరిగే పిచ్చిది కూడా ఏదో బస్సెక్కి పోయింది.

తన బుక్‌స్టాలూ కన్పించట్లేదు.

బస్టాండంతా బరువు తూచే యంత్రాలు.. పాప్‌కార్న్ మెషీన్లు..రంగుల టీవీలు..గ్రైండర్ల మోతలు.. హైటెక్ బస్సులు..

బాబా మనసు మొద్దుబారింది. ఇంటివైపు నడవటం మొదలెట్టాడు.

టీవీలు, కంప్యూటర్లు, ఇంటర్నెట్‌లు తన బుక్‌స్టాల్‌పై ఉగ్రవాదుల్లాదాడిచేసాయి.

తన బుక్‌స్టాల్ ఇక కన్పించదు.. ఇక కన్పించదు.. ఇక కన్పించదు..

బాధగా కళ్లు చీకట్లు కమ్మాయి. గుండె లయ తప్పింది.. అడుగులు తడబడ్డాయి.. చేతికర్ర ఆసరా తప్పింది..

ఆ క్షణంలో ఎదురుగా వస్తున్న బస్సు.. మృత్యు శకటమే అయింది.

అల్లా..హ్.. అన్న ఆర్తనాదం..

రోడ్డంతా కలకలం..

మర్నాడు..

బస్టాండ్‌లో మొయినొద్దీన్ బాబా మళ్ళీ కన్పించాడు- వేలాడదీసిన దినపత్రికల్లో.. చచ్చిపోయి!

★